# డిపాజిట్లపై వడ్డీరేట్లు చౌక

## 20 బేసిస్ పాయింట్లు తగ్గించిన పలు బ్యాంకులు

న్యూఢిల్లీ, మే 26: డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి ఒక్కో బ్యాంకులు. రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను తగ్గించిన పలు బ్యాంక్‌లు..తాజాగా డిపాజిట్లపై కూడా కోత పెడుతున్నాయి. దీంట్లోభాగంగా ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు కూడా తమ డిపాజిట్లపై వడ్డీరేట్లను 20 బేసిస్ పాయింట్లు కోత పెట్టాయి. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది ఐసీఐసీఐ బ్యాంక్. ఈ నూతన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీరేటు 3 శాతం నుంచి 7.05 శాతం మధ్యలోకి దిగిరాగా, సీనియర్ సిటిజన్లకు 3.5 శాతం నుంచి 7.55 శాతం లోపు వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మరోబ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ కూడా ఇంతే స్థాయిలో డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించింది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను కోత పెట్టింది. ఈ రేట్లు ఈ నెల 23 నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో ఎఫ్‌డీలపై వడ్డీరేట 3 శాతం నుంచి 6.85 శాతానికి దిగిరాగా, సీనియర్ సిటిజన్లకు 3.5 శాతం నుంచి 7.35 శాతానికి దిగొచ్చాయి. గత నెలలో ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే.



# పెట్టుబడి ఒప్పందాలపై ఆపసోపాలు




**కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్న అధికారులు ● యూనిట్లను పెట్టేందుకు ముందుకు రావాలంటూ ఒత్తిడి ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులను ఆరా తీస్తున్న పలు సంస్థలు ● ప్రతికూలంగా మారుతున్న సీఎం 'దివాలా' మాటలు**

హైదరాబాద్, మే 26(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది. ఆఘమేఘాల మీద లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ మాటలు కోటలుదాటడం లేదు. ఈ భారీ పెట్టుబడులపై అవగాహనా ఒప్పందాల(ఎంవోయూ)ను కుదుర్చుకున్న రాష్ట్ర సర్కారు.. ఇప్పుడు వాటి కార్యరూపం దాల్చలేక నానా తంటాలు పడుతున్నది. ప్రభుత్వ ఆదేశాలమేరకు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఆయా పెట్టుబడిదారులతో సంప్రదింపుల్లో నిమగ్నమయ్యారు. సాధ్యమైనంత తొందరలో కంపెనీలు ప్రారంభించాలని వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఏమైనా సందేహాలుంటే తమతో చెప్పాలని, ప్రభుత్వంతో మాట్లాడి వాటిని సరిచేస్తామని భరోసా ఇస్తున్నప్పటికీ ఆయా కంపెనీల్లో చలనం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉండటంతో ఆయా సంస్థలు ఇతర రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలు, ఇతర పరిస్థితులపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అంతేకాదు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం పదే పదే చెబుతున్న మాటలు కూడా పెట్టుబడిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నట్లు పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి.

### పాతవే..కానీ కొత్తగా ఒప్పందాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రతినిధుల బృందం రెండు సార్లు దావోస్ సదస్సుకు హాజరు కావడంతో పాటు సింగపూర్, అమెరికా, లండన్, తైవాన్, జపాన్ తదితర దేశాల్లో పర్యటించి దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఏడాదిన్నరలో జరిగిన ఈ ఎంవోయూలలో కొన్ని గతంలోనే బీఆర్‌ఎస్ సర్కారుతో కుదుర్చుకున్న ఒప్పందాలు మళ్లీ చేసుకోగా..మరి కొన్ని మాత్రం కొత్తగా చేసుకున్నాయి. అయితే ఎంవోయూ చేసుకున్న ఏ ఒక్క కంపెనీ కూడా ఇప్పటి వరకు భూములు కేటాయించాలని కానీ, పరిశ్రమకు అనుమతులు కావాలని దరఖాస్తు కూడా చేసుకోలేదు. మరోవైపు, ప్రభుత్వం సైతం ఎంవోయూలనే పెట్టుబడులుగా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకొని మౌనం దాల్చింది. అయితే, సీఎం స్థాయిలోనే వచ్చి పెట్టుబడులు కోరడంతో ఉత్సాహంగా ముందుకొచ్చి ఎంవోయూలు చేసుకున్న పలు కంపెనీలు... అనంతరం రాష్ట్రంలోని పరిస్థితులను తెలుసుకొని అవాక్కవుతున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రోత్సాహకాలు కల్పించే పరిస్థితి లేకపోవడం, గత ఏడాదిన్నరగా పరిశ్రమలకు దాదాపు రూ. 3, 500 కోట్లకుపైగా సబ్సిడీలు బకాయి ఉండటం తదితర అంశాలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నట్లు పేర్కొంటున్నారు. రాష్ట్రం దివాలా తీసిందని, ఇచ్చేందుకు తమ వద్ద ఏమీ లేదని, తమకు అప్పు ఇచ్చేవారు కూడా లేరని ముఖ్యమంత్రి పదే పదే చెబుతుండటం పెట్టుబడిదారులను మరింత ఆలోచనలో పడేస్తున్నట్లు చెబుతున్నారు. పొరపాటున ఇక్కడ పెట్టుబడి పెడితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు రాకపోగా, కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీలు కూడా రాకుండా పోతాయని వారు భావిస్తున్నారు. దీంతో ఎంవోయులు చేసుకున్న పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలవైపు చూస్తున్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై వెంటనే ఆయా కంపెనీల ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపాలని ఆదేశించినట్లు, దీంతో అధికారులు ఎలాగైనా కంపెనీలు ఏర్పాటయ్యేలా చర్యలకు శ్రీకారంచుట్టారు.

### కంపెనీల రాకపై ప్రతికూల ప్రభావం చూపుతున్న కొన్ని అంశాలు..

- ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారడం
- పరిశ్రమలకు సుమారు రూ.3,500 కోట్లకు పైగా బకాయిలు పెండింగులో ఉండటం
- కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం
- సీఎం పదేపదే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం
- కేంద్రం నుంచి పెద్దగా సహకారం లభించకపోవడం
- గతంలో కేటీఆర్ తరహాలో ప్రస్తుత నిర్ణయాలు తీసుకునే నేత లేకపోవడం
- ప్రభుత్వ భూసేకరణకు రైతులనుంచి తీవ్ర వ్యతిరేకత రావడం
- రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోవడం
- ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు రెట్టింపు ప్రోత్సాహకాలతో ఆకర్షించడం

### ఏపీ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నజర్

మరోవైపు, తెలంగాణ రాష్ట్రంతో కుదిరిన ఎంవోయులపై ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి సారించినట్టు పరిశ్రమ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి పథంలో ఉన్న మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రం ఆఫర్ చేస్తున్న ప్రోత్సాహకాలకన్నా అధికంగా ఇస్తామని ఆయా కంపెనీలకు ఆశ చూపుతున్నట్లు సమాచారం. అంతేకాదు, తమ రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన ఎకోసిస్టం అభివృద్ధి చెందినట్లు, ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులూ ఉండవని, త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించే ఆస్కారం ఉంటుందని వారు చెబుతున్నారని తెలిసింది. తెలంగాణతో ఎంవోయూలు చేసుకున్న కంపెనీల్లో పదికిపైగా సంస్థలు ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలతో చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కంపెనీల వివరాలు వెల్లడించేందుకు వారు నిరాకరించారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి సంపూర్ణ అండదండలు ఉండడం ఆ రాష్ట్రాలకు కలిసొచ్చే అంశం కాగా, తెలంగాణ సీఎం పదే పదే రాష్ట్రం దివాలా తీసిందని చెప్పడం మనకు మైనస్‌గా మారిందని వారు వివరిస్తున్నారు. అందుకే పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలవైపు మొగ్గు చూపుతున్నాయని చెబుతున్నారు.

### హామీ లేని సంప్రదింపులతో ఫలితం ఎంత?

ప్రోత్సాహకాలు, సబ్సిడీల విషయంలో కంపెనీ వర్గాలు లేవనెత్తుతున్న సందేహాలపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నారు. మీ సందేహాలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తామని చెబుతున్నారే తప్ప వారిలో భరోసాను కల్పించలేక విఫలమవుతున్నారు. దీంతో కంపెనీ వర్గాలు అధికారుల ఫోన్‌కాల్స్‌ను లైట్‌గా తీసుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వంతో ఎంవోయూలు చేసుకున్న కంపెనీలతో చర్చించి సబ్సిడీలకు సంబంధించిన కార్యాచరణ ప్రకటించాలని, కంపెనీలకు ఏ విధమైన నష్టం జరగని రీతిలో ప్యాకేజీ ఉండాలని వారు కోరుతున్నారు. నోటిమాటతో చెప్పడం కాదని, స్పష్టత కావాలని వారు కోరుతున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నదని అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# 99 వేల పైకి పుత్తడి

## మరో రూ.550 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, మే 26: బంగారం ధరలు మళ్లీ ప్రియమవుతున్నాయి. ఆభరణాల వర్తకులు, రిటైలర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో పదిగ్రాముల పుత్తడి ధర మళ్లీ రూ.99 వేల పైకి చేరుకున్నది. గత శనివారంతో పోలిస్తే పుత్తడి ధర రూ.550 ఎగబాకి రూ.99,300 పలికింది. గడిచిన వారంలో బంగారం ధర రూ.3 వేలకు పైగా పెరిగినట్టు అయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.500 అధికమై రూ.98,800 పలికింది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పరుగులు పెట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,170 ఎగబాకి రూ.1,00,370 పలికింది. అంతకుముందు ఇది రూ.99,200గా ఉన్నది. ఈయూ దేశాలపై విధించిన 50 శాతం టారిఫ్‌లను వాయిదావేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ధర తగ్గుముఖం పట్టినప్పటికీ దేశీయంగా పెరిగిందని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 24.83 డాలర్లు తగ్గి 3,332.59 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

### ఐదేండ్లలో 9 వేల డాలర్లకు ఔన్స్ ధర !

బంగారం బుసలుకొడుతున్నది. ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరలు భవిష్యత్తులో భారీగా పెరిగే అవకాశాలున్నాయని నివేదికలో వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్వల్పకాలంలో ఔన్స్ గోల్డ్ ధర 4 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని 'గోల్డ్ వీ ట్రస్ట్ రిపోర్ట్ 2025' పేరుతో విడుదలైన నివేదిక వెల్లడించింది. ఇదే క్రమంలో వచ్చే ఐదేండ్లలో ఔన్స్ ధర 8,900 డాలర్లకు చేరుకోనున్నదని పేర్కొంది. మన కరెన్సీలో ఇంచుమించు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల లోపు ఉండనున్నది. అప్పటి డాలర్-రూపీ కరెన్సీల ఆధారంగా ధరలు నిర్ణయించబడుతాయి.



### ఒలెక్ట్రా లాభం 139 కోట్లు

హైదరాబాద్, మే 26: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.139.21 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఏడాది వచ్చిన లాభంతో పోలిస్తే 77 శాతం వృద్ధిని కనబరిచింది. అలాగే ఆదాయం రూ.1,801.9 కోట్లుగా నమోదైందని పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ కేవీ ప్రదీప్ మాట్లాడుతూ.. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం వల్లనే ఆర్థిక ఫలితాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొన్నారు.

# మళ్లీ 82 వేల పైకి సెన్సెక్స్

ముంబై, మే 26: దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాలపరంపర కొనసాగుతున్నది. యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాల విధింపును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జూలైకి వాయిదావేయడం, రుతుపవనాలు ముందస్తుగా కేరళను తాకడం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా వాహన, ఐటీ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించడం కూడా సూచీలకు కలిసొచ్చింది. ప్రారంభంలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించింది. ఇంట్రాడేలో 771 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82వేల మైలురాయిని మళ్లీ అధిగమించింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 455.37 పాయింట్లు అందుకొని 82,176.45 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ సైతం 148 పాయింట్లు ఎగబాకి 25 వేలకు చేరుకున్నది. ఆటోమొబైల్ రంగ షేర్లతోపాటు తయారీ, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. మహీంద్రా అండ్ మహీంద్రా షేరు అత్యధికంగా 2.17 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటర్స్, నెస్లె, ఐటీసీ, హెచ్‌యూఎల్, ఎల్‌అండ్‌టీ, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్ల నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే వాహన రంగ సూచీ 1 శాతం అధికమవగా, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, టెక్నాలజీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ సూచీలు లాభపడ్డాయి.



### రోటర్‌డ్యామ్‌తో ఏఎం గ్రీన్ జట్టు

న్యూఢిల్లీ, మే 26: గ్రీన్‌కోకు చెందిన ఏఎం గ్రీన్..రోటర్‌డ్యామ్ ఆథార్టీతో జట్టుకట్టింది. ఈ ఒప్పందంలో భాగంగా భారత్‌తోపాటు యూరప్‌లో గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇరు దేశాల మధ్య బిలియన్ డాలర్ల విలువైన మిలియన్ టన్నుల గ్రీన్ ఫ్యూయల్ వార్షిక వాణిజ్యం జరగనున్నదని పేర్కొంది. భారత్, యూరప్‌కు చెందిన రొటర్‌డ్యామ్ మధ్య జరిగిన ఒప్పందంపై ఉన్నతాధికారులు సంతకాలు చేశారు.

### తులం బంగారం.. మహిళలకు రూ.2500 ఎక్కడ?

కోల్‌సిటీ, మే 26: కల్యాణ లక్ష్మి పథకం ద్వారా తులం బంగారం, తెల్ల కార్డు కలిగిన మహిళలకు నెలకు రూ. 2500 జీవన భృతి ఇస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా వాటి ఊసే ఎత్తడం లేదని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కే కనకరాజ్ పేర్కొన్నారు. గోదావరిఖని ఎల్‌బీ నగర్ 32వ డివిజన్ మహాసభ సోమవారం ఆ డివిజన్ కార్యదర్శి మార్కపురి సూర్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాలను ప్రజలు నమ్మి ఓటు వేసి అధికారం కట్టబెడితే ఆ ప్రజలను మోసం చేసిదందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడంలో సీపీఐ రాజీలేని పోరాటాలకు సిద్ధంగా ఉందన్నారు. అందుకు డివిజన్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు.రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి.. ఈ మహాసభలో సీపీఐ నాయకు లు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదె మ్మ, రేణిగుంట్ల ప్రీతం, శనిగరపు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, నక్క రాయమ ల్లు, పోతరాజు నాగరాజు, సుద్దాల అనురాజ్, మార్కపురి సౌజన్య, సరోజన, పు ష్ప, మంగ, లక్ష్మీపతి, రవి, కళాకారులు ఎజ్జ రాజయ్య, లెనిన్, జూల మోహన్, మొండి తదితరులు పాల్గొన్నారు.

### వేసవి శిక్షణతో క్రీడా నైపుణ్యానికి బాసట

రామగిరి, మే 25 : వేసవి శిక్షణ శిబిరం క్రీడా నైపుణ్యానికి బాసటగా ఉంటుందని రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం బీవీ సత్యనారాయణ అన్నారు. 25 రోజులుగా రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరై శిక్షణ పొందిన క్రీడాకారులు, ఔత్సాహికక్రీడాకారులందరికీ క్రీడా దుస్తులు అందజేశారు. ఈ శిక్షణ శిబిరంలో పుట్ బాల్, వాలీబాల్, హాకీ, విలువిద్య తదితర క్రీడాంశాల్లో 85 మందికి శిక్షణ ఇప్పించారు.

### మాతృశక్తి మహిళా తిరంగా ర్యాలీ

పెద్దపల్లి టౌన్, మే 26: మాతృశక్తి మహిళ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి సోమవారం తిరంగా ర్యాలీ తీశారు. మనం సైతం దేశం కోసం అనే సంకేతం ప్రజలకు ఇవ్వడానికే తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు నాయకురాలు తారాబాయి తెలిపారు. ఇక్కడ మాతృ శ్రీ సభ్యులు కవిత, శ్రీవాణిరెడ్డి, వేదశ్రీ, ఝాన్సీ, జ్యోతి, స్రవంతి, సత్యం, రవి, రమేశ్, మురళి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న మహిళలు

### హమాలీ కార్మికుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

పాలకుర్తి, మే 26: పాలకుర్తి మండలం జయ్యారం గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు నక్కలక్ష్మయ్య కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని సోమవారం సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 12న ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీ దాన్యం లోడింగ్ చేస్తుండగా, వడ్ల బస్తా పైన పడి వెన్నెముక విరిగిందని, లక్ష్మయ్య కుటుంబానికి జిల్లా కలెక్టర్, సహకారసంఘం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా వేగంగా ధాన్యం లోడింగ్ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్న క్రమంలో హమాలీ కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదాలకు గురైన కుటుంబాలను ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, నాయకులు కొత్తూరి సదానందం, నాంపల్లిభూమయ్య, లెక్కల విష్ణు, కొత్తూరి మల్లేశం, చింతకింది భూమయ్య, మేకల లచ్చయ్య, చింతకింది మల్లేశం, మెరుగు పర్వతాలు, లచ్చయ్య, లింగయ్య, రాజేశ్, స్వామి, లక్ష్మణ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణులు బలి

**● జిల్లా లో యథేచ్ఛగా అటవీ జంతువుల మాంసం అమ్మకాలు**
**● పట్టించుకోనిఫారెస్ట్ అధికారులు**

కాల్వశ్రీరాంపూర్ ,మే26: మండలంలోని అటవీ ప్రాంతాలైన వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, కూనారం, కాల్వశ్రీరాంపూర్, ఇద్లాపూర్ తో పాటు పలు గ్రామాల్లో వన్యప్రాణుల వేట జోరుగా కొనసాగుతుంది. ప్రస్తుత వేసవిలో అటవీ ప్రాంతంలో నీళ్లు లేకపోవడంతో వన్య ప్రాణులు వాటి దాహం తీర్చుకునేందుకు గ్రామ సరిహద్దులు, పంట చేన్ల వద్దకు, హుస్సేన్‌మియా, మానేరు పరీవాహక ప్రాంతాలకు, చెరువులు, కుంటల వద్ద నీళ్లు ఉన్న ప్రదేశానికి వస్తుంటాయి. ఇదే అదనుగా భావించిన కొందరు వేటగాళ్లు, అవి దాహం తీర్చుకునేందుకు వస్తున్న నీటి వనరులను గుర్తించి ఆ నీటిలో విషగుళికలు కలపడం, ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి ,వాటిని వేటాడి చంపుతున్నాడు. యథేచ్ఛగా గ్రామాల్లో వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. అటవీ ప్రాంతాలను ఆసరాగా చేసుకుని, అటవీ ప్రాంతంలో వ్యవసాయ పంటపొలాల వద్ద ఉన్న కరెంట్ తో గుట్టల చుట్టు విద్యుత్ తీగలు అమర్చి ప్రతి రోజు వన్యప్రాణులను వేటాడి చంపి , వాటి మాంసాన్ని పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కుందేళ్లు, కొండ గొర్రెలు, దుప్పులు, జింకలు, అడవి పందులు, మెకం తదితర వన్య ప్రాణులను వేటాడి మాంసాన్ని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారుల అండదండలతోనే ఈ అక్రమ దందా కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. జిల్లాలోని అటవీ గ్రామాల్లో అటవీ శాఖ ఉద్యోగులు ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. వన్యప్రాణుల వేటతో పాటు, మరోవైపు అక్రమ కలప రవాణా సాగుతుంది. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై పలు విమర్శలున్నాయి. అటవీ జంతువులైన కుందేళ్ళు, అడవిపందులు, కొండగొర్రె, జింక, తదితర జంతువులతో పాటు, నెమళ్లు కనుమరుగవుతున్నాయి. ఒక్కో కుందేలు ధర రు.500 నుంచి 600 వరకు విక్రయిస్తున్నారు. అడవిపంది మాంసం కిలో ధర రు.200 పైనే. నెమలి, దుప్పి మాంసం ధర మరింత ప్రియంగా అమ్ముతున్నట్లు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఏదు మాంసం కావాలంటే ముందే వేటగాళ్లను కలవాలట. వేటగాళ్లు అమర్చిన ఉచ్చులకు జంతువులతో పాటు, పలువురు రైతులు రాత్రి వేళలో వాటిన గమనించక మృత్యువాత పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక్కడి నుంచి అడవి జంతువుల మాంసం జమ్మికుంట, హుజూరాబాద్, పెద్దపల్లి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు దృష్టి సారించి వన్యప్రాణులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా వన్యప్రాణులను వేటాడుతున్న వేటగాళ్లను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వేటగాళ్ళ ఉచ్చులకు బలైన కుందేళ్లు (ఫైల్)


#### చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణులను వేటాడితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. ఈ విషయం మా దృష్టికి రాలేదు. అటవీ ప్రాంతాల్లో మా బీట్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. పిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమ కలప రవాణా పై దృష్టి సారిస్తాం.

- వాయుకుమార్. ఎఫ్ఎస్వో

### రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు కరువు

**● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**
**● పట్టించుకోని ప్రజాప్రతినిధులు**



కొలనూర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నేల పై కూర్చున్న మహిళలు

ఓదెల, మే 24: రైల్వే స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓదెల, కొలనూర్, పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా స్టేషన్‌లలోని ప్లాట్‌ఫాం లపై ప్రయాణికులు కూర్చుండడానికి సిమెంట్ బల్లలు కూడా సరిగా లేవు. దీంతో వివిధ శుభకార్యాలకు, పనుల మీద కొత్త దుస్తులు వేసుకుని వెళ్లె ప్రయాణికులు నేల పైన కూర్చుంటూ ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, అనారోగ్యంతో ఉన్న వారు నేల పైన కూర్చోవడం కష్టంగా ఉంటుంది. అలాగే రాత్రి వేళ లైటింగ్ కూడా సరిగా లేని కారణంగా మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్లాట్‌ఫాం లపై షెడ్స్ కూడా సరిగా లేవు. దీంతో వర్షానికి తడిసే పరిస్థితి ఉంది. రైల్వే స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ రైల్వే స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు కల్పించడానికి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మక్కల మిషన్ వెనక కూర్చున్న కూలీలు

### ప్రమాదమని తెలిసినా ప్రయాణం

జూలపల్లి, మే 26 : బతుకు దెరువు కోసం బయలు దేరుతూ కూలీలు ప్రమాదపుటంచున్న ప్రయాణం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామాల్లో యజమానులు ట్రాక్టర్లకు మక్కల మిషన్ తగిలించుకుని వెళ్తున్నారు. సొంత ఊర్ల నుంచి కూలీలు వివిధ ప్రాంతాలకు మక్కలు పట్టడానికి మిషన్ల వెనక కూర్చోని ప్రయాణం చేస్తున్నారు. యజమానులు కూలీలను మక్కల మిషన్ వెనక ఇరువైపులా టైర్ల బడ్ గార్డులపై కూర్చోబెడుతున్నారు. కంకర తేలి, గుంతలు పడిన రోడ్లపై వాహనాలు అజాగ్రత్తగా నడుపుతున్నారు. అదుపు తప్పి వాహనాలు పడిపోతే కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోనున్నాయి. కూలీలకు తరలించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ చేయూత

కోల్‌సిటీ, మే 26ః అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. గోదావరిఖని పరశురాంనగర్‌కు చెందిన దొంత రాజు పక్షవాతం బారిన పడ్డాడు. ఐతే అతని పరిస్థితి తెలుసుకొని వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్‌ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి స్పందించి తక్షణ సాయం పంపించారు. వీహెచ్‌ఆర్ ప్రతినిధులు సిగిరి రాము ఆధ్వర్యంలో సభ్యులు అతడని పరామర్శించారు. డివిజన్ ఇన్‌ఛార్జి గడ్డం ప్రశాంత్ రూ.10వేల సాయం అందించారు. కార్యక్రమంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, వీహెచ్‌ఆర్ సభ్యులు ముత్యాల ప్రవీణ్, రావుల నరేశ్, అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు కొండె సురేష్, పోయిల రవితోపాటు స్థానికులు పాల్గొన్నారు.

### ఈసెట్ టాపర్ అక్షయకు అభినందన



అక్షయను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి, మే 26: తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన ఈ సెట్-25 ఫలితాలలో మైనింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలోనే మొదటి ర్యాంకు సాధించిన రామయ్యపల్లి గ్రామానికి చెందిన కుర్మ అక్షయను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఉన్నత విద్య చదివేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చా రు. కుర్మ అనిల్‌కుమార్ సాధారణ మేస్త్రీ. తమ కూతురు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మాజీ సర్పంచ్ బుద్ధార్థి బుచ్చయ్య, నాయకులు బర్ల శ్రీనివాస్, పీఆర్ ఫౌండేషన్ ఫర్ సొసైటీ వెల్‌నెస్ అండ్ ఎంపవర్‌మెంట్ ప్రతినిధులు పోనంపల్లి రవి, కాటపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అండర్‌గ్రౌండ్ ఉద్యోగులకు అలవెన్స్ చెల్లించాలి

గోదావరిఖని, మే 26: సింగరేణి యాజమాన్యం సంస్థ అవసరాల నిమిత్తం అండర్‌గ్రౌండ్ ఉద్యోగులను ఉపరితల పనులను చేయించుకుంటున్న వారికి అండర్‌గ్రౌండ్ అలవెన్స్ చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ పేర్కొన్నారు. సోమవారం జీడీకే 1ఇంక్లైన్‌లో కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 1ఇంక్లైన్‌లో యాజమాన్యం అండర్‌గ్రౌండ్ ఉద్యోగులను ఒత్తిడి చేసి సంస్థ అవసరాల కోసం సర్ఫేస్ ఐరన్ బొగ్గు బంకర్ నిర్మాణం, ప్యాచ్ వెల్డింగ్, ఏరియా వర్క్ షాప్, ఇతర ఉపరితల పనులను చేయించుకుంటూ అండర్‌గ్రౌండ్ భత్యాన్ని చెల్లించడం లేదన్నారు. బొగ్గు గనుల చట్టం 1952 నియమాల ప్రకారం అలవెన్స్‌ను చెల్లించాలని ఆయన గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఏఐటీయూసీ ఆర్జీ-1 నాయకులు సంకె అశోక్, మనాల శ్రీనివాస్, కలవేణి రాజేవ్, నందిని నరేశ్, శంకరయ్య, నగేశ్, కొప్పుల లింగయ్య, తదితరులు ఉన్నారు.

### సైబర్ నేరస్తులతో జాగ్రత్త

ఫర్టిలైజర్‌సిటీ, మే 26: రామగుండం పోలీసు కమిషనరేట్ పోలీసుల అధికారుల ఫోటో, పేర్లతో సైబర్ నేరస్తులు ఫేక్ ఫేస్‌బుక్, వాట్సాప్ అకౌంట్ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఫ్రెండ్ రిక్వెస్ట్‌లతో డబ్బులు అడగడం, ఆర్మీ అధికారి బదిలీతో ఇంటి సామాగ్రి తక్కువ ధరకు అమ్మకమని, పుట్టిన రోజుగా బహుమతులు పంపిణీగా చాట్ చేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. పోలీసు అధికారి ప్రొఫైల్ పొటో చూసి వారే చాట్ చేస్తున్నారని నమ్మి ప్రజలు మోసపొవద్దని సూచించారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మారం,మే26:ఎరువులు,పెస్టిసైడ్ దుకాణాలలో నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మారం ఇన్‌చార్జి ఏవో భాస్కర్ హెచ్చరించారు.ఈ మేరకు ధర్మారం మండల కేంద్రంలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్స్ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు .నకిలీ ఎరువులు విక్రయించి రైతులను మోసగిస్తే విత్తన చట్టం ప్రకారం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాలలోని క్లస్టర్ ఏఈవోలకు సమాచారాన్ని రైతులు అందించి సహకరించాలని ఇన్‌చార్జి ఏవో భాస్కర్ కోరారు.